క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్ నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, న్యూ శాయంపేట, జీఎస్ఎం స్కూల్, జూ పార్కు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు ఓరియంటేషన్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం (2025 - 2026)లో ప్రవేశాలు పొందిన బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు ఈనెల 18న క్యాంపస్‌లోని సెనెట్ హాల్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ, కన్వీనర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, వరంగల్ టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, ఇంజనీరింగ్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎం.సదానందం పాల్గొంటారని పేర్కొన్నారు.

రవీందర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండకు చెందిన ఎడ్ల రవీందర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) డాక్టరేట్ ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఓయూలో ఫిజిక్స్ విభాగంలో పరిశోధకుడిగా గ్రీన్ సింథసిస్ డిరైవిడ్ సలఫైడ్ టెల్లురైడ్ బేస్డ్ నానో స్ట్రక్చరర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ అప్లికేషన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రవీందర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఓయూ ఫిజిక్స్‌విభాగం ప్రొఫెసర్ కటకం మధుకర్ పర్యవేక్షణలో రవీందర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. రవీందర్ ప్రస్తుతం హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

మున్నూరు కాపు సంఘం 'రాష్ట్ర కార్యదర్శిగా' కోటేశ్వరమ్మ




ఖిలా వరంగల్: మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా వరంగల్ శివనగర్‌కు చెందిన కామిశెట్టి కోటేశ్వరమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తమ రావు పటేల్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరమ్మ మాట్లాడుతూ మున్నూరు కాపుల సంక్షేమం, ఐక్యత కోసం కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కమిటీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



మడికొండ: ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామంలోని శ్రీసాయి ఆర్చ్‌డ్ కాలనీకి చెందిన మాదడి కృష్ణారెడ్డి(74) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో పడుకొని ఉండగా ఎవరికీ చెప్పకుండా కృష్ణారెడ్డి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో అతడి కోసం కుటుంబ సభ్యులు అన్ని చోట్ల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి కుమారుడు మాదడి రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 87126 85248 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

కొనసాగుతున్న సీపీఎం శిక్షణ తరగతులు



ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట రాంచందర్ భవనంలోని సీపీఎం జిల్లా ప్రధాన కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం రాజకీయ శిక్షణ తరగతులు కొనసాగాయి. శిక్షణ తరగతులకు రామన్నపేట, కరీమాబాద్ ఏరియా నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్యతోపాటు నాయకుడు అరూరి రమేష్ హాజరై వివిధ అంశాలపై మార్గ నిర్దేశం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గున్నాల ప్రభాకర్, కేకే రమేష్, పోరుమాటి శివ, అప్పాజీ వాణి, మూడేడ్ల ఉపేందర్, ఆలం, ఎండి.జుబేదా, మీర్ సాజియా, కొల్లూరి రమేష్, చీర కవిత, పాడిశెట్టి రవీందర్, గొర్రెపల్లి కుమార్, గాలయ్య, ఇస్మాయిల్, ఎండి.బేగం, చెవుల శ్రీనివాస్, రేణుక, కృష్ణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'గోలక్ష్మి' కళ తప్పింది

అన్నదాతకు భారంగా పశువులు

- రోజురోజుకూ తగ్గిపోతున్న పశుసంపద
- ప్యాకెట్ పాలకు అలవాటు పడుతున్న జనం

ఒకనాడు పల్లెలకు వెళితే ఎక్కడ చూసినా పశువుల జాడే.. ఎందుకంటే నాడు పాడిని లక్ష్మీదేవి అంటూ కొలిచేవారు. అలాగే, ప్రతీ ఇంటిలో గోవులు, గేదెలను పెంచి పోషించేవారు. నేడు ఆ జాడ ఎక్కడా కానరావడం లేదు. ఎక్కడో కానీ పశువులు కనిపించడం లేదు. అసలు ఏమైంది.. మూగజీవాలన్నీ ఏమైపోయాయంటే.. పశుపోషణ భారంగా మారడం.. చాలా మంది రైతులు వ్యవసాయానికి దూరంగా ఉండడం.. పశువులు మేపడానికి కాపర్లు దొరకకపోవడం తదితర కారణాలతో పశు పోషణ అంటేనే భయపడిపోయి అంగళ్లలో విక్రయించారు. దీంతో పల్లెల్లోనూ నేడు గోలక్ష్మి కళ తప్పింది. ప్యాకెట్ పాలకు జనం ఎగబడే రోజులు వచ్చేశాయి. ఆ మూగజీవాల వ్యథలపై ప్రత్యేక కథనం.



సోమిడిలో గేదెలను మేతకు తీసుకెళ్తున్న కాపరి



గేదె పాలు పితుకుతున్న రైతు

కాజీపేట: పాడి అంటే లక్ష్మీదేవితో సమానం. అందుకే పూర్వం ప్రతీ ఇంటిలో పాడి తప్పనిసరిగా ఉండేది. అంతేకాకుండా రైతు కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా ఉండేది. అందుకే ప్రతీ ఒక్కరూ పాడి పశువులను పెంచి పోషించేవారు. అయితే, కాలానుగుణంగా ఖర్చులు పెరిగిపోవడంతో పశువుల పెంపకం భారంగా మారింది. దాంతో రైతులు ఒక్కొక్కరుగా పశువులను అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పశు సంపద తగ్గిపోతోంది. పశువులను పెంచి పోషించే రైతులు నేడు కానరావడం లేదు. గతంలో 10 పశువులను పోషించిన రైతు కూడా నేడు కనీసం రూ.30 పెట్టి పాల ప్యాకెట్ కొనుగోలు చేసే పరిస్థితులు వచ్చేశాయి. అందుకే ప్రస్తుతం పల్లెల్లోనూ పాల ప్యాకెట్లు విక్రయించే స్టాళ్లు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి.

ఒకప్పుడు ఇంటికో గేదె

రెండు దశాబ్దాల కాలం క్రితం ప్రతీ ఇంటిలో ఓ పాడి పశువు ఉండేది. కాజీపేట మండలంలోని సోమిడి, ఉనికిచర్ల, తరాలపల్లి, అయోధ్యపురం, రాంపేట, బోడగుట్ట, సుబ్బయ్యపల్లె తదితర గ్రామాల నుంచి పదుల సంఖ్యలో మహిళలు పాల గంపలను నెత్తిన పెట్టుకుని పట్టణాలకు వెళ్లి పాలను గ్లాసులతో కొలిచి విక్రయించేవారు. నేడు పాల ప్యాకెట్ల రంగప్రవేశంతో వందల సంఖ్యలో మహిళలు ఉపాధిని కోల్పోయారు. వారేకాక ఎంతో మంది సైకిళ్లు, మోటారు సైకిళ్లపై పాలను పల్లెల నుంచి వరంగల్ నగరానికి తెచ్చి విక్రయిస్తూ ఉపాధిని పొందేవారు. ఇప్పుడు ఒకరిద్దరు తప్ప పెద్దగా పాలను విక్రయించే వ్యక్తులు చూద్దామన్నా కనిపించని పరిస్థితి.

గేదె పాలకు డిమాండ్

ఒకనాడు గేదె పాలు తప్ప ప్రత్యామ్నాయం ఉండేది కాదు. అయితే ప్రస్తుతం అందరూ ప్యాకెట్ పాలకు అలవాటు పడిపోయారు. ఎక్కడైనా గేదె పాలు దొరుకుతున్నాయంటే అక్కడ జనం క్యూ కడుతున్నారు. ఒకప్పుడు లీటరు రూ.20లకు విక్రయించిన పాలను నేడు రూ.70 నుంచి రూ.80 వరకూ విక్రయిస్తున్నారు. పాడుగు దగ్గర పాలు కావాలంటే వాటి ధర వేరేగా ఉంటోంది. దీంతో ప్రస్తుతం పాడి లాభదాయకంగా ఉన్నా కొంతమంది రైతులు మాత్రమే ఆసక్తి చూపుతున్నారు. అది కూడా అదే వ్యాపకంగా చేసుకున్న రైతులు మాత్రమే నేడు పశువులను పోషిస్తున్నారు. సుమారు 10 నుంచి 20 గేదెలతో ఫారాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. వచ్చే పాలను విజయ, ములుకనూర్, ఎస్ఎస్ఆర్ తదితర సంస్థలకు విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ సహకారం అంతంతే..

పాడి పశువుల పెంపకం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ప్రోత్సాహకాలు అందించకపోవడం అత్యంత బాధాకరమనే అభిప్రాయాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. పాలకు సరైన గిట్టుబాటు లేకపోవడంతో పాటు దాణా ఖర్చులు పెరగడం కూడా పెంపకందారుల్లో ఆసక్తి తగ్గడానికి ఒక కారణంగా చెప్పొచ్చు. పాడి గేదెల కొనుగోలుకు పూర్తి సబ్సిడీతో కూడిన రుణాలను అందిస్తే తప్ప మళ్లీ పాత రోజులు రావని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పశువులను పెంచడం మాటలు కాదు..



ప్రస్తుతం పశువులను పెంచడం అనేది ఆషామాషీ కాదు. ఒకప్పుడు ఎండు గడ్డిని ఉచితంగా ఇచ్చే వారు. ఇప్పుడు ఎకరం గడ్డి రూ.8 వేలకు పైగా ధర పలుకుతోంది. పనిలేనోడే పశువులను సాదుకోవాలనే సామెత నేడు నిజమైంది.

\- బోయిని నాగరాజు, రైతు

పరిశుభ్రమైన పాల కోసమే..



ప్రస్తుతం గ్రామాల్లో కూడా ఎక్కడా మంచి పాలు దొరకడం లేదు. పశువులను పెంచుకోవడం ఇబ్బంది అయినప్పటికీ పాల కోసం ఇంట్లో గేదెలను పెంచుతున్నాం. స్వజాతి పశువుల జాతి క్రమేణా తగ్గిపోతోంది.

\- కాయిత యాదగిరి, సోమిడి

ఇంటిలో పాలు, పెరుగు ఎప్పుడూ ఉండేవి



గతంలో మా ఇంటిలో ఎప్పుడు చూసినా పాలు, పెరుగు ఉండేవి. సొంత ఆవులు, గేదెల పెంపకంతో ఉపాధి పొందేవాళ్లం. ఎంతో మందికి ఇంటింటికి వెళ్లి పాలు, పెరుగు విక్రయించి ఉపాధిని పొందేవాళ్లం. నేడు పాల ప్యాకెట్ల రాకతో అన్నింటికి దూరం అయ్యాం.

\- మారి మల్లేశం, రైతు, కాజీపేట

నాలాల కబ్జా



పుట్టలమ్మ చెరువు



చింతగట్టు క్యాంపు వద్ద నిలిచిన వరద (ఫైల్)

- పెండ్లి వాగు మాయం
- రోడ్డుపై నిలుస్తున్న భారీ వరద

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భీమారంలోని పుట్టలమ్మ చెరువు వాగు, నాలాలు కబ్జా అయ్యాయి. ఫలితంగా వరద నీరు బయటికి వెళ్లకుండా రోడ్డుపైనే నిలుస్తోంది. ఫలితంగా రాకపోకలు పూర్తిగా స్తంభిస్తున్నాయి. ఈ చెరువు సుమారు 56 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. చెరువు కింద సుమారు రెండు వందల ఎకరాలు ఆయకట్టు ఉంది. కాలక్రమేణా నగరం విస్తరించడంతో సాగుభూమి ప్లాట్లుగా మారుతోంది. ఫలితంగా చెరువు నిరుపయోగంగా మారింది.

డీఫ్లోరైడ్ రిజర్వాయర్‌గా..

చెరువు నిరుపయోగంగా మారడంతో డీఫ్లోరైడ్ రిజర్వాయర్‌గా మార్చారు. 1996లో సుమారు రూ.20 కోట్లతో డీఫ్లోరైడ్ రిజర్వాయర్ పనులు ప్రారంభించారు. 28 ఎకరాల్లోనే రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. ఈ రిజర్వాయర్ ద్వారా హసన్‌పర్తి, హనుమకొండ మండలాల్లోని 24 గ్రామాలకు డీఫ్లోరైడ్ నీటిని అందించారు. తర్వాత జరిగిన మార్పుల కారణంగా రిజర్వాయర్‌ను పూర్తిగా ఎత్తివేశారు.

పెండ్లి వాగు మాయం

పుట్టలమ్మ చెరువు నుంచి వెళ్లే వాగు (పెండ్లివాగు)కు ఒక చరిత్ర ఉంది. భీమారం, హసన్‌పర్తి, చింతగట్టు, పలివేల్పుల, ముచ్చర్ల, మునిపల్లి గ్రామాల్లో పెండ్లి జరిగితే వరుడు పెండ్లి వాగువద్ద సేద దీరేవాడు. ఆ తర్వాత ముస్తాబై ఎడ్ల బండి, వాహనంపై కల్యాణ మండపానికి చేరేవాడని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆ వాగుకు పెండ్లి వాగు అని పేరొచ్చింది. సుమారు 33 ఫీట్ల వెడల్పుతో ఈ వాగు ప్రవహించేది. మూడు కిలో మీటర్ల మేర వాగు వ్యాపించే ఉండేది. ఈ వాగునీరు సమీపంలోని కొచ్చెరు ప్రవహించేది. అలాగే ఈ చెరువు నుంచి 12ఫీట్లతో ఉన్న మరో రెండు కాల్వలు కూడా కబ్జాకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. కొంత మంది రియల్టర్లు, రాజకీయ వేత్తలు, పారిశ్రామిక వేత్తలు సైతం వాగు, నాలాలను కబ్జా చేసి దర్జాగా ప్లాట్లు, భవనాలు నిర్మించారు. ప్రస్తుతం వాగు, నాలాల ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోయాయి. అలాగే, భీమారంలోని శ్యామల చెరువు నాలా పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఈ చెరువు పరిధిలోని నాలాలు కబ్జాకు గురయ్యాయి.

చింతగట్టు వద్ద రోడ్డుపై నిలుస్తున్న వరద

వాగు, నాలాల కబ్జా వల్ల వరద నీరు దిగువ ప్రాంతానికి వెళ్లడానికి వీలులేకుండా పోవడంతో రోడ్డుపై నిలిచిపోతోంది. ప్రతిఏటా హనుమకొండ – కరీంనగర్ మార్గమధ్యలోని చింతగట్టు సమీపంలోని ఓఆర్ఆర్ నుంచి ఇరువైపులా రెండు వందల కిలోమీటర్ల దూరం వరకు రాకపోకలు స్తంభిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఓటు చోరీపై నిరసన

ఆత్మకూరు : ఓటు చోరీపై మండల కేంద్రంలో ఆదివారం రాత్రి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేసిందని నినదించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీధర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్

ఖిలా వరంగల్: ఎంసీపీఐ (యూ)ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దామని, పేదల సమస్యల పరిష్కారం కోసం మరింత ఉధృతంగా పోరాటాలు చేద్దామని పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి మాలోతు సాగర్ సూచించారు. ఈ మేరకు వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని చైతన్య పరపతి సంఘం భవనంలో ఎగ్గెని మల్లికార్జున్ అధ్యక్షతన విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో నిరుద్యోగం, పేదరికం, దారిద్రం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని అభిప్రాయపడ్డారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ముక్కెర రామస్వామి, సుంచు జగదీశ్వర్, సహాయ కార్యదర్శి ఐతే నగేష్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు బహుజన రాజ్యాధికార పార్టీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

హన్మకొండ: బహుజన్ రాజ్యాధికార పార్టీ (బీఆర్పీ)ని గడప గడపకు తీసుకెళ్లనున్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో గడప గడపకు బీఆర్పీ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని సంవత్సరాలుగా పాలక పార్టీల నాయకులకు బందీలుగా ఉన్న బహుజనులను రాజకీయ విముక్తి చేస్తూ, ఎలాంటి రాజకీయ ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం లేని యువతకు అధికారంలో, పదవులలో సమాన అవకాశాలు కల్పించడమే తమ ధ్యేయమన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న న్యాయవాది బండి మొగిలి మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతిఒక్కరూ మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్, కాన్షీరాం వంటి మహనీయుల చరిత్ర, త్యాగాలను చదివి జ్ఞానోదయం పొందాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బుర్ర సాగర్, అంకేశ్వర రమేష్, పూరేల్ల రమేష్, ఉపాధ్యక్షులు ఎడ్ల రవి ముదిరాజ్, పీసరి రజిత, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ మహానంది అవార్డుల ప్రదానోత్సవం



అవార్డు అందుకుంటున్న రాతిపల్లి సాంబయ్య



శ్రీధరాచార్యులును సన్మానిస్తున్న ప్రముఖులు



రవీందర్‌కు అవార్డు అందజేస్తున్న అతిథులు

హన్మకొండ / రామన్నపేట / హన్మకొండ కల్చరల్ : పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురిని రోజా క్రియేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో సన్మానించి కాకతీయ మహానంది ప్రదానం చేశారు. కళారంగంలో సేవలందిస్తున్న కళాకారులకు రోజా క్రియేషన్స్ కాకతీయ మహానంది అవార్డులు అందించి సత్కరిస్తోంది. వృత్తి ఆర్టీసీ ఉద్యోగం, ప్రవృత్తి కళాకారుడిగా రాణిస్తున్న రాతిపల్లి సాంబయ్యకు కాకతీయ మహానంది అవార్డును శనివారం రాత్రి హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు అందజేశారు. వరంగల్ రామన్నపేట వాసి, పోచమ్మమైదాన్, ఎల్బీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ప్రముఖ గాయకుడు తంయ్యాల శ్రీధరాచార్యులును కాకతీయ మహానంది పురస్కారంతో సత్కరించారు. మహానంది అవార్డును లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ పోతన క్లబ్ చైర్మన్, శ్రీబాలాజీ క్రియేషన్స్ నిర్మాత, కళాపోషకులు, సేవారత్న లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ అందుకున్నారు. ముఖ్య అతిథులుగా ఏసీపీ జితేందర్ రెడ్డి, ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు గట్టు మహేష్‌బాబు, రిటైర్డ్ ఉప విద్యాశాఖాధికారి బూర విద్యాసాగర్ సాగర్ గౌడ్, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాస్, తిరునగరి నరేందర్, రోజా క్రియేషన్ అధినేత ఆలేటి శ్యాంసుందర్, తదితరులు పాల్గొని వివిధ రంగాలకు చెందిన 20 మంది ప్రముఖులకు కాకతీయ మహానంది పురస్కారాలు అందజేశారు.

ఘనంగా పోచమ్మతల్లి ఉత్సవాలు



సోమిడిలో బోనాలు సమర్పిస్తున్న భక్తులు



మడికొండ: మొక్కులు చెల్లిస్తున్న కాలనీ వాసులు



ఎస్ఆర్ఆర్ తోటలో బోనాలతో మహిళలు



బోనంతో వెళ్తున్న వినయ్ భాస్కర్ కుటుంబ సభ్యులు

కాజీపేట: చల్లని తల్లి పోచమ్మ మమ్మేలమ్మ అంటూ ఊరు, వాడ ఒక్కటై బోనాల పండుగను కాజీపేట పట్టణంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయాలకు చేరుకుని నైవేద్యం సమర్పించారు. బాపూజీనగర్, శాంతినగర్‌కాలనీ, సోమిడి, విద్యానగర్ కాలనీ, సిద్ధార్థనగర్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో బోనాలు చేసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్ – రమ దంపతులు, సంకు నర్సింగ్, బాబుక్యాంపులో కుమ్మరి సాంబయ్య, కాంగ్రెస్ నాయకులు సాగరిక, రమాకాంత్ రెడ్డి, ఎలకంటి రజిత, నాయకులు పాల్గొన్నారు.

46, 64వ డివిజన్లలో..

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46, 64వ డివిజన్లలో పోచమ్మ తల్లి బోనాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. 46వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో, మడికొండ పాత పోలీస్‌స్టేషన్ వద్ద, చెరువు కట్ట వద్ద ఉన్న పోచమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తల్లికి పంచామృతాలతో అభిషేకించి, నూతన వస్త్రాలంకరణ చేశారు. ఉదయం మేకపోతులు, కోళ్లను తల్లికి బలిఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బోనాలు, చీర, సారెలతో మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించారు.

వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో..

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో పలు డివిజన్లలో పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా త్రికోట, శివనగర్, చింతల్, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, గణేష్‌నగర్, రంగశాయిపేట, శంభునిపేట, శాంతినగర్, లక్ష్మీనగర్, ఏకశిల నగర్, విద్యానగర్ కాలనీల్లోని భక్తులు బోనాలతో పోచమ్మ దేవాలయాలకు చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్ పల్లం పద్మ, రవి, శోభన్‌బాబు, రాజేశ్వర్‌రావు, ప్రవీణ్, మాటేటి శ్యామ్, అశోక్, శ్రీకాంత్, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ప్రత్యేక గౌరవం

హన్మకొండ: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గౌరవం దక్కిందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలో పోచమ్మ తల్లిని కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలను బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రత్యేక పండుగగా ప్రకటించి, ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. ప్రతీ ఏడాదిలాగే వడ్డెపల్లి పోచమ్మ తల్లి బోనాల పండుగను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వినయ్‌భాస్కర్ సతీమణి రేవతి, సోదరుడు దాస్యం విజయ్ భాస్కర్, కుమారుడు కృష్ణవ్ భాస్కర్, కుమార్తె కృషిక భాస్కర్ పాల్గొన్నారు.

ఊరును ఏలుకునే తల్లి పోచమ్మ



పోచమ్మగుడి వద్ద క్యూలైన్‌లో భక్తులు

హన్మకొండ కల్చరల్: ఊరును ఏలుకునే తల్లి పోచమ్మకు ఉచిత బోనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కాశిబుగ్గ పోచమ్మ గుడి అభివృద్ధి కమిటీ చైర్మన్ చింత కృష్ణ తెలిపారు. ఈ మేరకు వరంగల్ కాశిబుగ్గ 19వ డివిజన్‌లోని పోచమ్మకు బోనాలు సమర్పించారు. శ్రావణమాసంలో చివరి ఆదివారం కావడంతో ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనం ఎత్తి పోచమ్మ తల్లికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శేషగిరి, కమిటీ వైస్ చైర్మన్ రాగుల నరేందర్, ప్రధాన పూజారి ఓరుగంటి రాజేందర్, అశోక్ కుమార్, అరుణ్‌కుమార్ నాగరాజు, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, యాదగిరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జానపద సంబురాల జాతర



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

హన్మకొండ కల్చరల్: ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గాన గాంధర్వులు వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి యాదిలో తెలంగాణ జానపద కళల ఆటపాట సంబురాల జాతర కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి హనుమకొండ పబ్లిక్‌గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధినేత జడల శివ, హరిత దంపతులు, అతిథులు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీతాల రఘువేందర్, ఆడెపు రవీందర్, అనితారెడ్డి, గిద్దె రాంనర్సయ్య, దార దేవేందర్, గద్దర్ సాంబయ్య, 33 జిల్లాల్లోని జానపద కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఐఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్

వరంగల్ క్రైం: పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు బాధితుడికి అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ నక్కలగుట్టకు చెందిన ఇందిర షాపింగ్ కోసం హనుమకొండకు చౌరస్తాకు రాగా రూ.1.30 లక్షల విలువైన ఐ ఫోన్ పోయింది. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్‌ను సంప్రదించడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు పోగొట్టుకున్న ఫోన్‌ను వెతికి ఆదివారం ఆమెకు అప్పగించారు. ఐ ఫోన్‌ను గుర్తించి అప్పగించడంలో ప్రతిభ కనబరిచిన క్రైం పార్టీ సిబ్బంది అశోక్, రావుఫ్‌ను ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ అభినందించారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష తులసీ అర్చన



హన్మకొండ కల్చరల్: శ్రావణ మాసంలోని చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని వరంగల్‌లోని బాలానగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి, అమ్మవారికి, శ్రీరామానుజుల స్వామికి లక్ష తులసీ అర్చనను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఏలపాటి రత్నాకర్‌రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసచార్యులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.